## క్లుప్తంగా

### ధర్నాకు తరలిరావాలి



మాట్లాడుతున్న నూతన్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 5న తహసీల్దార్ కార్యాలయం ఎదుట, 7న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేశ్, నాయకులు ఫాసిద్దీన్, వెస్లీ, పోశెట్టి పాల్గొన్నారు.

### రేపు మండల సర్వసభ్య సమావేశం

కుంటాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవాలని ఆయన కోరారు.

### అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. యూరియా బ్యాగు ధర రూ.270, 20:20:13 బ్యాగు ధర రూ.1140 ఉందన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్‌తో కార్యాలయానికి వచ్చి బ్యాగులను తీసుకెళ్లాలన్నారు.

### రాయితీ గొర్రెలు పంపిణీ



గొర్రెలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కిషన్

కుంటాల: మండలంలోని అందకూర్‌లో ప్రభుత్వం 75 శాతం రాయితీపై అందించిన గొర్రెలను ఆదివారం 15 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కిషన్, ఎంపీటీసీ మధుకర్, పశువైద్యాధికారి ప్రకాశ్, ఉపసర్పంచ్ వినోద్, కన్నం లక్ష్మణ్, మోతన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

### మేరు సంఘం కార్యవర్గం



రాపర్తి లక్ష్మణ్

కడెం: మండల కేంద్రంలో ఆదివారం మేరు కుల సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. సంఘం మండలాధ్యక్షుడిగా రాపర్తి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా సతీశ్, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి వెంకటేశ్, సంయుక్త కార్యదర్శిగా గంగానర్సయ్య, కోశాధికారిగా రాములు, సలహాదారుగా గట్ల నల్లగొండను ఎన్నుకున్నారు.

### బాధిత కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న ఎన్‌జీవో సభ్యులు

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన నగునూరి మల్లేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. జైజవాన్..జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ.ఎనిమిది వేలు ఆర్థికసాయం అందించారు. సభ్యులు గంగాధర్, మల్లేశ్, అంజన్న, శేఖర్, లక్ష్మణ్, మహేశ్, ఆనంద్, మల్లేశ్, రవి ఉన్నారు.

### బాలమంచ్ జిల్లా కోఆర్డినేటర్‌గా అనిల్

ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన జవహర్ బాలమంచ్ ఆర్గనైజేషన్ జిల్లా కోఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన మడిగెల అనిల్‌ను నియమించినట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనిల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించినందుకు రాష్ట్ర కోఆర్డినేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 7 నుంచి 18 ఏళ్ల వారికి అభ్యాసం, అభివృద్ధి వాతావరణం అందించేందుకు ఇది ఏర్పడిందన్నారు.

### పోచమ్మకు పూజలు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో మహాపోచమ్మ ఆలయం వద్ద భక్తులు పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు.

### దుస్తులు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో దివ్యాంగులకు ఆదివారం ఆర్మూర్‌కు చెందిన ప్రసన్నకుమారి పుట్టినరోజు సందర్భంగా దుస్తులు, పండ్లను మా అమ్మనాన్న ఫౌండేషన్ చైర్మన్ మాదరి ఆంజనేయులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకాశ్, సాయవ్వ, పోశెట్టి తదితరులున్నారు.

# కబ్జాలో ప్రభుత్వ స్థలాలు

- పీహెచ్‌సీ వద్ద ఇష్టానుసారంగా టేలాల నిర్మాణం
- పలు చోట్ల బండ్లబాట ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కుభీర్‌వాసులు



ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ చేసిన వాహనాలు



కుభీర్‌లో ఆసుపత్రి ప్రహరీ ధ్వంసం చేసి అక్రమంగా ఏర్పాటు చేసిన టేలాలు

కుభీర్: మండల కేంద్రంలో పలు చోట్ల ప్రభుత్వ స్థలాలను కొందరు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. దీనిపై అధికారులు, పాలకులు మౌనం వహిస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**కుభీర్ పీహెచ్‌సీ వద్ద..**

కుభీర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రహరీని కూలగొట్టి కొందరు 40 వరకు రేకులషెడ్లు నిర్మించుకొని చిరువ్యాపారం చేసుకుంటున్నారు. మరికొందరు నిర్మించుకున్న షెట్టర్లను అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. పీహెచ్‌సీ సమీపంలో ఇష్టానుసారం మురికి కాలువపై షెడ్లు(టేలాలు)నిర్మించడంతో వర్షం కురిస్తే వరద ఆసుపత్రి ఆవరణలోకి వెళ్తోంది. దీంతో ఆసుపత్రికి వచ్చిపోయే వారు ఇబ్బందులు పడుతున్నారు.

**ఆవరణలోనే బయటి వాహనాల పార్కింగ్..**

మరోవైపు ఆసుపత్రి ఆవరణలో బయటివ్యక్తులు జీబులు, ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, డీసీఎం వంటి వాహనాలను నిలుపుతున్నారు. మరికొందరు అక్కడే వెల్డింగ్ పనులు చేసుకుంటున్నారు. ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు వచ్చి అడిగితే ఖాళీ చేస్తామని అంటూనే వారు వెళ్లగానే యథావిధిగా పనులు చేసుకుంటారు. పదేళ్లుగా ఇదే తంతు. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వ్యాపారులకు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ కొందరు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు.

**వడ్డెర కాలనీలో కబ్జాకు గురైన బండ్లబాట..**

మండల కేంద్రంలోని వడ్డెర కాలనీ పక్క నుంచి జామ్‌గాం గ్రామానికి వెళ్లే ఎడ్లబండ్ల బాట(పానాది) ఆక్రమణకు గురైంది. రైతులు ఈ మార్గం గుండానే తమ పొలాలకు వెళ్తుండేవారు. ఈ బాటను ఆనుకొని ప్రభుత్వం 1989లో 300 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. కానీ కొందరు ఎండ్లబండ్ల బాటను ఆక్రమించుకున్నారు. జామ్‌గాం వెళ్లేందుకు మరో రోడ్డు ఉన్నా.. పొలాలకు వెళ్లే రైతులు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని రెండేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తహసీల్దార్, సర్పంచ్ ఆదేశాలతో కొందరు ఆక్రమణలు తొలగించగా.. మరికొందరు ససేమీరా అంటున్నారు.



జామ్‌గాంకు వెళ్లే ఎడ్లబండ్ల బాట

**పశువైద్యశాల వెనుక..**

పశువైద్యశాల వెనుక నుంచి రోడ్డును కొందరు ఆక్రమించుకోగా.. మరికొందరు పెంట కుప్పలు పోశారు. పోలీస్‌స్టేషన్ పక్క నుంచి దార్‌కుభీర్ వెళ్లే మార్గంలో ఉన్న ఎడ్ల బండ్లబాటను కొందరు ఆక్రమించగా.. వాటిని తొలగించి రెండేళ్ల కిందట పంచాయతీవారు గ్రావెల్ రోడ్డు వేశారు. కొందరు ఇప్పటికీ ఆక్రమణలు తొలగించలేదు.

### ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



సర్కారు ఆసుపత్రి ప్రహరీని ఆనుకొని నిర్మించిన ఆక్రమణలను తొలగించాలి. ఆవరణ లోకి నీళ్లు రాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించాలి. అధికారులు ప్రభుత్వ స్థలాలను కాపాడాలి.

– బంక బాబు, కుభీర్

### ఆక్రమణలు తొలగించాలి



జామ్‌గాం పానాదిపై అక్రమంగా షెడ్లు నిర్మించడంతో చేన్లకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. సమస్య పరిష్కరించాలని రెండేళ్లుగా చుట్టూ తిరుగుతున్నాం. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించాలి.

–ఉప్పు దత్త్రాత్రి, కుభీర్

### కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న ఆక్రమణల విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. కలెక్టర్ ఆదేశాలతో బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. మిగతా చోట్ల పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– విజయ్, ఈవో, కుభీర్

# పోలింగ్ కేంద్రాలు పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్



సోన్ : న్యూవెల్మల్‌లో పరిశీలిస్తున్న అధికారి

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. కేంద్రంలో నీటి సౌకర్యం, విద్యుత్, మరుగుదొడ్ల వంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఆర్ఐ కృష్ణాగౌడ్, సూపర్‌వైజర్ హరీశ్, బీఎల్‌ఓ వసంత తదితరులు ఉన్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం, సంగంపేట గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను ఆదివారం తహసీల్దార్ శివరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో న్యూవెల్మల్ ఉపసర్పంచ్ గడ్డం స్వామి, ఆర్ఐ రఫీక్, సూపర్‌వైజర్ నిషిత, బీఎల్‌వోలు రాజమణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదుతోపాటు మార్పులు, చేర్పుల కోసం నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పరిమళ్ భౌమిక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 238, 244వ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బీఎల్వోలు వరలక్ష్మి, చందురాణి ఉన్నారు.

# మట్టి సేకరించిన బీజేపీ నాయకులు



కిష్టాపూర్‌లో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

లోకేశ్వరం: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఆదివారం మండలంలోని కిష్టాపూర్‌లో బీజేపీ నాయకులు మేరీ మిట్టి– మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీలో నిర్మిస్తున్న అమృత వాటిక కోసం ఇంటింటికీ తిరిగి మట్టిని సేకరించారు. పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేసి అమృత కలశానికి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాన్ని జిల్లా కేంద్రానికి పంపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీపురం నారాయణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ సుమన్‌కుమార్, రమేశ్, సురేందర్, మహేశ్ గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, సాయికుమార్, గంగాధర్ ఉన్నారు.

**ప్రతీ గ్రామం నుంచి మట్టి సేకరించాలి**

కుంటాల: ఢిల్లీలో నిర్మించే అమృత వాటిక కోసం మండలంలోని ప్రతీ గ్రామం నుంచి మట్టి సేకరించాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. ఆదివారం మండలంలోని పెంచికల్‌పాడ్‌లో మేరీ మిట్టి– మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కదం భోజాబాయి, మాజీ సర్పంచ్ దిగంబర్ పటేల్, సంతోష్, లక్ష్మణ్ పటేల్, శంకర్, నితిన్ క్రాంతి, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

# గజ్జలమ్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గజ్జలమ్మ దేవికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు.

కుంటాల: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో సప్తమి వేడుకలు కొనసాగుతున్నాయి. ఆదివారం భక్తులు ఏకతాళం, భజన నిర్వహించారు. బోనగిరి చిన్న రాములు అన్నదానం చేశారు.

### 'లోఓల్టేజీ సమస్య పరిష్కరించండి'

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిసరాల్లో నెలకొన్న లోఓల్టేజీ సమస్యను అధికారులు పరిష్కరించడం లేదని ప్రణాళిక సంఘం జిల్లా మాజీ సభ్యుడు ఎం ఏ వకీల్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోఓల్టేజీ కారణంగా రెండేళ్లుగా భీమన్నగుడి ప్రాంతంలోని ఇళ్లలో నీటి మోటార్లు సరిగా పనిచేయక పోవడంతోపాటు ఎలక్ట్రిక్ గృహోపకరణాలు దగ్ధమవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా 7, 8 వార్డుల పరిధిలో సింగల్‌ఫేజ్‌ను త్రీఫేజ్‌గా మార్చాలని కోరారు. సమస్య పరిష్కరించకుంటే కాలనీవాసులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట పలువురు ఉన్నారు.



### ఎన్నాళ్లీ రోడ్డు కష్టాలు

ఖానాపూర్: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు రెండేళ్లుగా ముందుకు సాగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి పట్టణంలో రోడ్డుపై పలు చోట్ల గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.



# 'ఆత్మహత్యల నివారణలో విఫలం'



ఆర్థికసాయం అందిస్తున్న వినోద్‌నాయక్

ఖానాపూర్: రైతుల ఆత్మహత్యలు నివారించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఏఐసీసీ రీసెర్చ్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. మండలంలోని చందునాయక్ తండాలో శనివారం ఆత్మహత్య చేసుకున్న మహేందర్ అనే రైతు కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. చనిపోయాక వచ్చే రైతు బీమా వద్దని.. రైతులు బతికి ఉన్నప్పుడు వారిని ఆదుకోవాలని ఆయన కోరారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు.

# కాంగ్రెస్ గెలిచేలా పని చేయండి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



కాంగ్రెస్‌లో చేరిన వారితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచేలా కార్యకర్తలు పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని చింతకుంటవాడ 40వ వార్డుకు చెందిన రాజేశ్వర్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు శ్రీహరిరావు తన క్యాంపు కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ నాయకులు పొడెల్లి గణేష్, నాందేడపు చిన్ను, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో కాషాయ జెండా ఎగరాలి

- బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



బీజేపీలో చేరిన వారితో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సోన్ మండలం గంజాల్ గ్రామానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీశ్‌రెడ్డి, సరికెల గంగన్న, గంగారెడ్డి, రాజేశ్వర్, ముత్తెన్న, ఫకద్దీన్, భూపతి రెడ్డి, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 'పాఠశాలలను పట్టించుకోని ప్రభుత్వం'

ఖానాపూర్: సర్కారు బడుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, బోధన, మధ్యాహ్న భోజన నిర్వహణను పర్యవేక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలాలకు పూర్తిస్థాయి ఎంఈవోలు లేకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడిందన్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని కోరారు.

# జోరు వర్షం.. ప్రజలకు ఇబ్బందులు



లక్ష్మణచాందలో వరి పొలంలో వరద



నిర్మల్‌లో సూచనలు చేస్తున్న చైర్మన్ ఈశ్వర్

లక్ష్మణచాంద: జిల్లావ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. మండల వ్యాప్తంగా రోడ్లు, పంటల్లో ఎక్కడ చూసినా వర్షపునీరే కన్పించింది.

**చెట్ల కొమ్మలు తొలగింపు**

ఖానాపూర్: పట్టణంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఖానాపూర్–తర్లపాడ్ ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్ల కొమ్మలను మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది పొక్లెయిన్ సాయంతో తొలగించారు. చెట్లు విరిగిపడడంతో కొంత సమయం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**మున్సిపల్ చైర్మన్ పర్యటన**

నిర్మల్‌టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో ఆదివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పర్యటించారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని రోడ్డు నంబర్–7లో డ్రెయినేజీ సమస్యతో వర్షపు నీరు కాలనీ రోడ్డుపై నిలుస్తుందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన చైర్మన్ పొక్లెయిన్ సాయంతో రోడ్డుపై నీరు నిలవకుండా తాత్కాలికంగా డ్రైన్ తీయించారు. త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, కాలనీవాసులు ఉన్నారు.



రోడ్డుపై పడిన కొమ్మలను తొలగిస్తున్న పొక్లెయిన్

### అటెన్షన్ ప్లీజ్.. బురదమయంగా రోడ్డు



తానూరు: మండలంలోని దాగాం గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. దీంతో రాకపోకలకు వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు బీటీ రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623